# పరాజితుడు

## శ్రీ జి. రామకృష్ణ

పోలయ్య ఆరోజు చేయవలసిన పని అయిపోయింది. కూలీడబ్బులు రూపాయి పావలా సంపాదించాడు. అదే అతనికి పెద్దమొత్తంగా తోచింది. రూపాయి నోటును అటూ యిటూ తిప్పి చూశాడు. మనస్సు సంతోషంతో తబ్బిబ్బు అయింది. పావలాబిళ్ళ అరచేతిలో మెరుస్తోంది. దాన్ని చూసి పోలయ్య మురిసిపోయాడు.

రేపటి గురించి అతనికి ఆలోచనే లేదు. కూలీ దొరకదన్న చింతలేదు.

పొలంనుంచి పంటధాన్యం తోలుకొస్తున్న రైతుమాదిరి పోలయ్య యింటికి బయలుదేరాడు రూపాయి పావలాతో. అతని నడకలో ఠీవి వుట్టిపడుతోంది, ముఖంలో తృప్తి నిండి వుంది. కొంతదూరం వచ్చాక చొక్కాజేబు తడిమి చూచుకున్నాడు. నోటూ, బిళ్ళా భద్రంగా వున్నాయి గూట్లో పక్షిపిల్లల్లాగా.

చకచకా ముందుకు అడుగులు సాగుతున్న పోలయ్య వున్నట్టుండి నడకజోరు తగ్గించాడు. వింత వాసన ఏదో అతణ్ణి ఆవరించి లోబరుచుకుంది. కమ్మటి వాసనలు విరజిమ్మే తోటగా తోచింది ఆప్రదేశం. అది పోలయ్యకు పరిచితమైన వాసనే. దాని తియ్యదనం, కమ్మదనం అతనిణ్ణి ఆకర్షించాయి. ఇలాంటి పరిస్థితి పోలయ్యకు తరచు ఎదురవుతూనే వుంటుంది. కొన్నిసార్లు నిగ్రహం చూపగలుగుతాడు, కోరికను జయించి ఆ ప్రదేశందాటి దూసుకుపోగలుగుతాడు. కానీ తరచు ఆ కోఠికకు దాసుడైపోతాడు.

ఆనాడు పోలయ్య కల్లుఅంగడిని దాటి ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోయాడు. రోడ్డుప్రక్కగా నిలబడి కోరికతో పోరాటం ప్రారంభించాడు. తానే జయంపొందినట్టు భ్రమించి కాలు ముందుకు వేయబోయాడు. కోరిక రెండు కాళ్ళనూ గట్టిగా పెనవేసుకుంది. శక్తి అంతా కూడగట్టుకుని నిగ్రహాన్ని వుసికొలిపాడు కోరికను లాగిపారేయమని. లాభంలేకపోయింది. నిగ్రహం చిత్తుగా ఓడిపోయి పోలయ్యవంక జాలిగా చూసింది. కోరిక విజయగర్వంతో జేబులోని రూపాయి పావలావైపు తొంగిచూసి పకపకా నవ్వింది.

తీర్పు చెప్పేసి నిష్క్రమించే న్యాయాధిపతి హుందాతో పోలయ్య కల్లు అంగడివైపు దారి తీశాడు. అప్పటికే అక్కడ కోలాహలంగా ఉంది. ముంతలు గబగబా ఖాళీ అవుతున్నాయి. రకరకాల తినుబండారా లమ్మేవాళ్ళు తమ బేరం జోరుగా సాగుతున్నందుకు సంతోషిస్తున్నారు.

పోలయ్య ముంతనిండా కల్లు పోయించుకున్నాడు. పాల సముద్రం చిలికి సంపాదించిన అమృతభాండంలా తోచింది ఆ ముంత పోలయ్యకి. కల్లుకుతోడు తినడానికి ఏవైనా వుంటే గాని పసందుగా వుండదు. పైగా పోలయ్యకి ఆకలిగా కూడా వుంది. మామూలు పదార్థాలు ఆ ముంతదగ్గర అంతగా రాణించవు. నాలిక చురుక్కుమని నషాళంవరకు ఘాటు అంటేవే దాని ఘాటికి ఆగుతాయి. అందుకుని పచ్చిమెరపకాయ బజ్జీలు ఒక అరడజను తీసుకున్నాడు. ప్రక్కగా జంగెట్లో 'ముక్కలు' అమ్ముతోంది ఒక అవ్వ. మధ్య మధ్య నంజుకోవడానికి వాటిని మించినవి లేవు. అవి నాలుగు కొన్నాడు. బీడీకట్ట కూడా కొన్నాడు.

అన్నీ తీసుకుని ఒక ప్రక్కగా కూర్చున్నాడు. ముంత ఐదు నిమిషాలలో ఖాళీ అయిపోయింది. అటూ యిటూ చూశాడు. మసగ మసగగా వుంది. ముంత వంక చూశాడు. లోపల కల్లు లేదు. నెమ్మదిగా లేచి వెళ్ళి మరోముంత పోయించుకున్నాడు.

ఇది గబగబా త్రాగలేకపోతున్నాడు. బీడీపైన బీడీ కాలుస్తున్నాడు. ఎంతో హాయిగావుంది. ఏమీ తెలియడంలేదు. ఎలాగయితేనేం ముంత ఖాళీ అయిపోయింది. బజ్జీలు, 'ముక్కలు'కూడా అయిపోయాయి. ఆ సంగతి పోలయ్యకి బాగా తెలియదు.

ఆ కల్లు అంగడి అతనికి ఇంద్రసభ మాదిరిగా కనిపిస్తోంది. ఇంద్రసభ ఎలా వుంటుందో ఒకసారి సినిమాలో చూశాడు. అవన్నీ తెలియకుండానే తలుపుకొస్తున్నాయి.

రుచి, మైకం, సంతోషం ఈ మూడింటిలో మునిగి తేలుతున్నాడు. మనిషి తేలికబడుతున్నట్లు అనిపిస్తోంది. కను రెప్పలు బరువెక్కుతున్నాయి.

ఎత్తుపీటమీద కూర్చుని కల్లు అమ్ముతున్న ఆసామీ పోలయ్య కళ్ళకు దేవేంద్రుడులా వున్నాడు. తూలుతూ పోతున్న ఆడ వాళ్ళని చూసి అప్సరసలు నాట్యం చేస్తున్నారనుకున్నాడు. బిచ్చ గాళ్ళు చేసే రణగొణ ధ్వనులు దేవతలు మ్రోయించే దుందు

ఘులుగా తోచాయి. అక్కడక్కడ జనం చతికిలపడిపోయి మైకంలో తీసే అల్లాయి పదాలు గంధర్వులగానం అని అను కున్నాడు.

పోలయ్య స్వర్గసుఖం అనుభవిస్తున్నాడు. కళ్ళుమూసుకు పోయాయి. అతికష్టంమీద కళ్ళు తెరవగలుగుతున్నాడు.

కొంతసేపు ఆ మగతలో సర్వం మరిచి కూర్చుండి పోయాడు ఆ యోగముద్రలో తాపసి మాదిరి.

మరికొంతసేపటికి కష్టపడి లేచి నిలబడ్డాడు. దూరంగా వెలుగుతున్న దీపాలు తారామండలంగా తోచాయి. మైకం యింకా దిగలేదు. కాళ్ళు తడబడుతున్నాయి. తూలుతూ క్రింద పడబోతూ, నిల్రదొక్కుకుంటూ అడ్డదిడ్డంగా నడుస్తూ వంతెన దగ్గరికి వచ్చాడు. వంతెన అంగడికి యిరవైగజాల దూరంలోనే వుంది.

తూలుతూపోయి అక్కడ నుంచున్న ఒకాయనమీద పడ్డాడు. ఆయన పోలయ్య అవస్థ చూసి నెమ్మదిగా అతన్ని నెట్టాడు. పోలయ్య క్రింద కూలబడ్డాడు.

మైకం సాంతం తగ్గకపోయినా యింటికి వెళ్ళాలన్న తలపు కలిగింది అతనికి తెలియకుండానే.

అర్థంలేని మాటలు ఏవో వాగుతున్నాడు. కనిపించిన ప్రతి రిక్షావాడితో ఏదో సోది చెప్పుతున్నాడు మాటలు సగం మింగేస్తూ.

పోలయ్యవాలకం చూసి రిక్షావాళ్లేవరూ అంగీకరించడం లేదు.

జేబులు తడిమి చూసుకున్నాడు. లోపల మిగిలిన పావలా బయటికితీసి పావలా యిస్తాను కిరాయి కట్టమంటున్నాడు. కాని ఎక్కడికి తీసుకుపోవాలో తెలియక ఎవరూ రావడంలేదు.

పది నిమిషాలనుంచీ యీ తతంగం అంతా గమనిస్తున్న ఒక రిక్షావాడు, తక్కిన రిక్షావాళ్ళను నెట్టుకుంటూ ముందు కొచ్చి నే తీసుకెళ్తా రమ్మన్నాడు. పోలయ్యను చేయి పట్టుకుని రిక్షాదగ్గరికి తీసుకెళ్ళాడు. మూటను పెట్టినట్లు అమాం తంగా పోలయ్యను రెండుచేతుల్తో ఎత్తి రిక్షాలో కూర్చో పెట్టాడు.

ఇది చూస్తున్న తక్కిన రిక్షావాళ్ళు అతని వింత ప్రవర్తనకి ఆశ్చర్యపోతున్నారు.

రిక్షా రంయిమని సాగిపోయింది.

పోలయ్య రిక్షాలో వాలిపోయి ఏదో మాట్లాడు తున్నాడు. రిక్షావాడు అదేమీ వినిపించుకోవటంలేదు.

రిక్షా అతివేగంగా పోతోంది.

పోలయ్య తన యింటినిగురించి చెబుతున్నాడు విని పించీ వినపించని మాటలతో.

రిక్షావాడు ఆ మాటలు లక్ష్యపెట్టటంలేదు. పోలయ్య వుండే పాక రాగానే రిక్షావాడు అతణ్ణి ఎత్తుకుని దింపి, పాక ముందు కూర్చోబెట్టాడు కుదేసినట్టు.

జేబులోనుంచి పావలాతీసి రిక్షావాడి చేతిలో పెట్టాడు పోలయ్య.

రిక్షావాడు ఆ పావలావంక చూశాడు. అతని కళ్ళు అప్ప టికే నీళ్ళతో నిండిపోయాయి. అది సరిగా కన్పించలేదు కూడా.

లోపల యిందాకటినుంచి అణచిపెట్టిన ఆవేశం పట్టు తప్పి పెల్లుబికింది. ఆ పావలాబిళ్ళను కసితో పోలయ్య ముఖానికేసి కొట్టాడు. అది పోలయ్యనుదురుమీద తగిలింది.

ఆ దెబ్బకు పోలయ్య అబ్బా! అని కేక పెట్టాడు.

లోపలనుంచి పోలయ్య భార్య గబగబా వచ్చింది కేక విని. భర్త త్రాగివచ్చి చేసే గొడవ ఆమెకు అలవాటే. భర్తను చూసింది.

అప్పటికే రిక్షావాడు వెనక్కు తిరిగి వెళ్ళిపోబో తున్నాడు.

పోలయ్య భార్య అతణ్ణిచూసి "నువ్వా రంగన్నా! అయ్యను తీసుకొచ్చింది. లోపలికి రాకుండా చక్కా పోతుండా వేరా నాయనా?" అని ఖంగారుగా అడిగింది కొడుకుని.

రంగన్న కళ్లనెంట నీళ్లు జలజలా కారుతున్నాయి. గొంతు మూగవోయింది.

కళ్ళు తన చింకి చొక్కాతో తుడుచుకుని రిక్షా త్రొక్కుకుంటూ వెళ్ళిపోయాడు బస్తీ వైపు, రిక్షా యింకా రెండుగంటలు తనవద్ద వుంచుకోవచ్చు కాబట్టి!